పోలీసుల మార్చ్‌ఫాస్ట్



చొప్పదండి: మండల కేంద్రంలో శనివారం పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా, మార్కెట్ చౌరస్తా మీదుగా పుర వీధుల గుండా పోలీస్ స్టేషన్ వరకు వందమంది ప్రత్యేక పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాంతిభద్రతల సంరక్షణ, ప్రజలకు నిత్యం అండగా ఉంటామని, ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని చొప్పదండి సీఐ ప్రకాశ్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మామిడాల సురేందర్, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్‌రావు

గంగాధర: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన లభిస్తోందని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని ఒద్యారం, ఆచంపల్లి, చిన్నాచంపల్లి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, పుస్తకాలు పంపిణీతో పాటు ప్రాథమిక తరగతులకు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా బోధన చేయనున్నామని, సర్కార్ బడుల్లోని వసతులను వివరించారు.

చొప్పదండి బంద్ విజయవంతం



చొప్పదండి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా పట్టణంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సన్మానం



సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న పాలడుగు అలేఖ్య, గేడెం స్వాతి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారని ప్రతి న్యాయవాది ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, మొదటి అదనపు మేజిస్ట్రేట్ పద్మ సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనూతాల శ్రీనివాస్, శిరీష, లైబ్రరీ సెక్రటరీ చౌడమల్ల భానుకిరణ్ మరియు సీనియర్ న్యాయవాదులు కేసరి శిష్య, భగవాన్ రెడ్డి, విజయ రెడ్డి, వీరసేనరెడ్డి, సమ్మిరెడ్డి, న్యాయవాదులు తదితరులున్నారు.

ఎంఈవోకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో భూపతి శ్రీనివాస్‌కు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తోందని, కనీస సదుపాయాలు లేకపోయినా అడ్మిషన్లు చేయించుకుంటున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రంలో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, మండల కార్యదర్శి రాపెల్లి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంట టౌన్ సీఐకి..



ఫిర్యాదు చేస్తున్న బాధితులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో చందాలకు సంబంధించిన నగదును ఆలయ కమిటీగా చెప్పుకుంటున్న వారు స్వాహా చేశారని అయ్యప్పస్వామి ఆలయ శరణార్థుల పేరుతో రిజిస్టర్ పోస్ట్ ద్వారా పలువురికి ఇటీవల పంపిన లేఖలు పట్టణంలో కలకలం రేపింది. లేఖల్లో అయ్యప్పస్వామి కమిటీ కార్యదర్శి సిరిమల్లె జయేందర్, ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్ పలువురు అక్రమాలకు పాల్పడ్డారని పేర్లు ప్రస్తావించారు. లేఖలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం టౌన్ సీఐ రవికి ఫిర్యాదు చేశారు. సీఐని వివరణ కోరగా ఫిర్యాదు వాస్తవమేనని పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

స్విమ్మింగ్ క్యాంప్ పరిశీలన



కొత్తపల్లి: వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ ఆవరణలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత స్విమ్మింగ్ క్యాంపును శనివారం ఫౌండేషన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించి వారిలో నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమాలతో పాటు విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తల్లిదండ్రులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా..

- సమస్యలతో సతమతమవుతున్న బొమ్మనపల్లి గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పీహెచ్‌సీ నిర్మాణ పనులు
- లాలయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో నాలుగు తరగతులు
- శిథిలావస్థలో పశువైద్యశాల



శిథిలావస్థలో పశువైద్యశాల

చిగురుమామిడి: మండలంలో పశువైద్యశాలలు లేకపోవడంతో పాటు ఉన్నవి శిథిలావస్థలోకి చేరుకున్నాయి. దీంతో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది అనేక ఇబ్బందులుపడుతున్నారు. పాలకులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యను పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మనపల్లిలో దాదాపు ఆరువందల మంది పాడి రైతులున్నారు. కరీంనగర్, ముల్కనూర్, విజయ వంటి డైయిరీల్లో పాడి రైతులు ఉదయం, సాయంత్రం పాలు పోస్తుంటారు. పాలిచ్చే పశువులకు చికిత్స అందించేందుకు వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నా పశువైద్యశాల లేదు. ఇప్పుడున్న ఉన్న భవనం సుమారు నలభై ఏళ్ల కిందట అప్పటి ఎంపీపీ, ప్రస్తుత సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య హయాంలో నిర్మించారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల కూలిపోయే దశలో ఉంది. పెచ్చులూడిపోతూ వర్షాకాలంలో నీరు భవనం లోపలికి చేరుతోంది. పశువులకు వినియోగించే మందులు నీటిలో తడుస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందోనని పశువైద్య సిబ్బంది భయపడుతున్నారు. రెండేళ్లుగా పాతబడిన ఎస్సీ హాస్టల్ భవనంలో పశువైద్యశాల నిర్వహిస్తున్నారు. నిత్యం పాములు, తేళ్లు, కోతులతో ఇబ్బందులు పడుతున్నామని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇకనైనా కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఒకే గదిలో 4 తరగతులు

బొమ్మనపల్లి అనుబంధ గ్రామం లాలయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో 4 తరగతులకు ఒకే గదిలో పాఠాలు బోధిస్తున్నారు. ఉన్న గది శిథిలావస్థలోకి చేరింది. లోపల నాలుగు తరగతులు, వరండాలో మరో తరగతి నిర్వహిస్తూ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత వంటగది లేక తాత్కాలికంగా నిర్మించిన చిన్నపాటి రేకులషెడ్డులో వంటచేస్తూ ఇబ్బందులుపడుతున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి చొరవతీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరుకు గదిలో పీహెచ్‌సీ



నలభై ఏళ్లుగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి శాశ్వత భవనం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. బొమ్మనపల్లిలో పురాతన చేనేత సంఘం(రేకుల షెడ్)లో కొంతకాలం వైద్యసేవలు అందించారు. పదేళ్లుగా పంచాయతీ భవనంలోని చిన్న గదిలో వైద్యసేవలు అందిస్తున్నారు. పల్లె దవాఖానా డాక్టర్, సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు కనీస సౌకర్యాలు తీర్చుకునే అవకాశంలేదు. ఉదయం వచ్చి సాయంత్రం వరకు గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యసేవలందిస్తున్నారు. రెండేళ్ల కిందట ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి రూ.ఇరవై లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ బేస్మెంట్ వరకే పనులు చేశాడు. పనులు ఎందుకు ముందుకు సాగడంలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



బేస్మెంటు వరకు పరిమితమైన ఆరోగ్య ఉపకేంద్రం పనుల గూర్చి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళాం. మూడేళ్ల క్రితం నిధులు మంజూరైతే ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు, జీపీలోని ఇరుకు గదిలో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద గ్రామం కావడంతో ప్రజలకు వైద్యం అందించేందుకు ఇబ్బందిగా ఉంది.

– మిట్టపల్లి మల్లేశం, మాజీ ఎంపీటీసీ, బొమ్మనపల్లి

సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు



బొమ్మనపల్లి గ్రామంలో పశువైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు పలువురు మార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలి. పాడిరైతుల ఇబ్బందులు తొలగించాలి.

– కంది శంకర్, డైయిరీ చైర్మన్, బొమ్మనపల్లి

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే



మానకొండూర్: వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో వరలక్ష్మి



చిగురుమామిడి: మాట్లాడుతున్న ఎంపీవో రాజశేఖర్

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, ఇంటి పన్ను రశీదు, ల్యాండ్ రిజిస్ట్రేషన్ పేపర్లు, సాదాబైనామా ఫ్యామిలీ డివిజన్, పట్టాదారు సర్టిఫికెట్లు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, గ్రామ కార్యదర్శి జీవిత, పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని రామంచ, బొమ్మనపల్లి గ్రామాల్లో ఎంపీఓ (మండల పంచాయతీ అధికారి) రాజశేఖర్ శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు పరిశీలించారు. ప్రతి వార్డుకు ఎనిమిది చొప్పున అర్హుల పేర్లను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో మిగతా ప్రత్యేకాధికారులు ప్రస్తుత నివాస గృహాలను పరిశీలించి కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై ఆరాతీశారు. వెంట ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.



శంకరపట్నం: వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శంకరపట్నం: అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని తహసీల్దార్ భాస్కర్‌కు మొలంగూర్ గ్రామానికి చెందినవారు వినతిపత్రం అందించారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. జాబితాపై విచారణ చేసి నిరుపేదలను గుర్తించాలని కోరారు.

పన్నుల వసూలు ముమ్మరం



రశీదు అందజేస్తున్న కమిషనర్ ఎండీ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వర్తక, వాణిజ్య వ్యాపార, ఇంటి యజమానులు పన్నులు చెల్లిస్తే ఐదుశాతం రిబేట్ పొందే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శనివారం పట్టణంలో పన్నుల వసూలు కార్యక్రమం ముమ్మరం చేశారు. ఏప్రిల్ నెలలో అడ్వాన్స్‌గా సంవత్సర చెల్లింపు చేస్తే రిబేట్ అందిస్తుందన్నారు. చివరి నా లుగు రోజుల్లో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినియర్ అసిస్టెంట్ భాస్కర్, ఎండి పాషా సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామంలో శనివారం ఉపాధిహామీ కూలీలకు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, జీపీ సిబ్బంది సంపత్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కూలీలు అస్వస్థతకు గురికాకుండా మజ్జిగ ప్యాకెట్లు అందజేశామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

ఇల్లందకుంట: నిబంధనలను ఉల్లఘించి పంచాయతీ కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుని పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తాత్కాలికంగా నియమించుకున్న కార్మికుడి పేరు నమోదు చేయడం అనుమానాలు రేకెత్తిస్తుందని, ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి కార్మికుడికి న్యాయం చేయాలని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించకుంటే కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరి మల్లయ్య, కార్మికుడు పర్లపెల్లి మల్లేశ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది'

చిగురుమామిడి: బీఆర్ఎస్ పాలనలో దళిత, బహుజనులకు ఒరిగిందేమిలేదని, రజతోత్సవ సభ నిర్వహించడంలో అర్థంలేదని మాజీ జెడ్పీటీసీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ విమర్శించారు. శనివారం మండల కేంద్రం చిగురుమామిడిలో మాట్లాడారు. మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని, యువకులు కేసుల్లో ఇరుక్కుంటే వారి కుటుంబాలకు చేసిందేమిటో చెప్పాలనిడిమాండ్ చేశారు. లక్షల ఉద్యోగాలని రిటైర్డ్ వయస్సు మూడేండ్లు కొనసాగించి నిరుద్యోగుల ఉసురు తీశారని విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండలశాఖ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, నాయకులు పెసరి శ్రీనివాస్, చీకుట్ల సదానందం, గంగుల లింగంకుమార్, పచ్చిమట్ల లింగమూర్తి, పోతర్ల శివాంజనేయులు, కక్కెర్ల సంపత్‌కుమార్, రాజేశం పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ స్కూల్ 2002–03 పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు.



కిష్కింధకాండ

వీణవంక: గుట్టలు, అడవుల్లో ఉండాల్సిన వానరాలు గ్రామాలపై దండయాత్ర చేస్తున్నాయి. ఇంటి పైకప్పును పీకి పారేస్తున్నాయి, ఆరుబయట ఆరబోసిన ధాన్యాన్ని చిందరవందర చేస్తున్నాయి. వరి ధాన్యం ఆరబోసిన రైతులకు ఇప్పుడు కొత్త భయం పట్టుకుంది. వందల సంఖ్యలో కోతులు ఒక్కసారిగా వచ్చి పంటను పాడుచేస్తున్నాయని వాపోతున్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



జమ్మికుంటలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న టీపీటీఎల్ఏ నాయకులు

హుజూరాబాద్: పహల్గాం ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని జిల్లా అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభాధ్యక్షురాలు కొండ్ర స్వరూప అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే చర్య అని, భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద తెలంగాణ ప్రైవేటు టీచర్స్,లెక్చరర్ల అసోసియేషన్(టీపీటీఎల్ఏ) ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులు అర్పించారు. ఉగ్రదాడులను ఖండిస్తున్నామని ఇలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ అన్నారు. పర్యాటకులపై దాడులు హేయమైన చర్య అని,ఇలాంటి దాడులు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. జమ్మికుంట, ఇల్లందకుంట ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



మానకొండూర్: అన్నారంలో...

వీణవంక: మండలంలోని బేతిగల్‌లో గ్రామస్తులు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు.

విజయవంతం చేయండి



డప్పు కొడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపు నిచ్చారు. బూర్గుపల్లిలో డప్పుకొట్టి ప్రచారం చేశారు.

మానకొండూర్‌రూరల్: ఊటూర్‌లో శనివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వీణవంక: మండలంలోని 26గ్రామాలలో బీఆర్ఎస్ జెండా గద్దెలకు రంగులు వేశారు. సభకు తరలివెళ్లే ముందు జెండా ఆవిష్కరించాలన్నారు. సభను విజయంవంతం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాడ సాదవరెడ్డి, వియభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తిమ్మాపూర్: సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని పార్టీ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్ కోరారు.

శంకరపట్నం: రజతోత్సవ సభ కోసంబీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్‌కు మొలంగూర్ గ్రామానికి చెందిన ఆలయ పూజారికి భంగిమటం నాగయ్య రూ.10వేల చెక్కు అందించారు.

చొప్పదండి: ఉగ్రదాడిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆర్థికసాయం



మానకొండూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన జేరుపోతుల అనిల్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు. అనిల్‌తో చదువుకున్న 2002–03 పదో తరగతి స్నేహితులు రూ.43 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అశోక్, వి.శ్రీకాంత్, బాబు, సిరిసిల్ల అశోక్, రాంకుమార్, ప్రశాంత్, బొల్లం నరేందర్, పిండి సందీప్, తాళ్లపల్లి సంపత్, మోదుంపల్లి రంజిత్ తదితరులున్నారు.

పుస్తెలతాడు చోరీ

హుజూరాబాద్: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. గ్రామానికి చెందిన కన్నెబోయిన కోమల ఈ నెల 25న ఇంటి బయట అర్ధరాత్రి నిద్రిస్తుండగా పుస్తెల తాడును చోరీ చేశాడు. ఆమె అరవడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేశామని సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.